## క్లుప్తంగా

### దుస్తులు పంపిణీ



దుస్తులతో ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు

**పోరుమామిళ్ల:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలలకు చెందిన 663 మంది విద్యార్థులకు సోమవారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాదరెడ్డిలు విద్యార్థులకు దుస్తులు అందచేశారు.

### దుప్పట్లు పంపిణీ



యానాదులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**బ్రహ్మంగారిమఠం :** మండల పరిధిలో కేశాపురం సమీపంలోని యానాది కాలనీలో సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి , సంస్థ ప్రతినిధులు ముత్తుముల రామతులసి, జయరాం, హరి తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణలో అసిస్టెంట్ కలెక్టర్

**మైదుకూరు :** జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మైదుకూరు రెవిన్యూ కార్యాలయంలో శిక్షణ కోసం వచ్చారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన ఈనెల 10వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విధులు, అధికారాలు తదితర అంశాలపై శిక్షణ తీసుకుంటారు. అదే విధంగా మైదుకూరు నుంచి బదిలీ అయిన బి.అనురాధ స్థానంలో వై.నరేంద్రనాథ్ రెడ్డి సోమవారం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం నుంచి మైదుకూరుకు బదిలీ అయ్యారు.

### తైక్వాండో పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక విన్ తైక్వాండో అకాడమి విద్యార్థిని సత్యభామ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచింది. ఈ విద్యార్థిని ఇటీవల చత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్-16 తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించింది. సత్యభామను కోచ్ సంతోష్, కమాల్ అభినందించారు.

### అభినందన



క్రికెట్ జట్టును అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

**ప్రొద్దుటూరు :** ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన ప్రొద్దుటూరు నియోజకవర్గం పురుషుల క్రికెట్ జట్టును మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సోమవారం అభినందించారు. భవిష్యత్తులో ఈజట్టు మరిన్ని పతకాలు సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** నగరంలోని సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషన్ కోర్సులలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9396161936 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### నేడు అవగాహన ర్యాలీ

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ ర్యాలీకి ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, అదనపు పోలీసు సూపరింటిండెంట్ లోసారి సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్ పాల్గొంటారన్నారు.

### డీఐజీని కలిసిన జిల్లా ఎస్పీ



కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావును కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

**కడప అర్బన్ :** కర్నూలు- కడప రేంజ్ నూతన డీఐజీ గా బాధ్యతలు చేపట్టిన సి.హెచ్. విజయరావును మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం కలిశారు. కర్నూలులోని డి.ఐ.జి కార్యాలయంకు వెళ్లి డీఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వైఎస్ఆర్ జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలను డీఐజీకి ఎస్పీ వివరించారు.

# వరిపంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



గోపవరం : పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ



కలసపాడు : తెల్లపాడు వద్ద వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**కలసపాడు :** వరిపంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. సోమవారం మండలంలోని తెల్లపాడు వద్ద సాగు చేసిన వరిపంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రత్త, వర్షాభావ పరిస్థితులు ఉండటం వలన వేసవిలో నీటిలోని ఉప్పు శాతం పెరగడం వలన వరిపంటలో నాట్లు వేసిన తర్వాత ఎదుగుదల లేకపోవడం, పసుపురంగులోకి మారడం, చనిపోవడం జరుగుతుందన్నారు. నాట్లు వేసే ముందు ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 కిలోల జింక్ వేసుకోవాలన్నారు.

ఒకవేళ నాట్లు వేసుకున్నట్లైతే పొలంలో నీటి పరిమాణం ఎండిపోకుండా చూసుకోవాలని, తరచుగా నీరు మార్చుతూ ఉండాలన్నారు. అలాగే జింక్ 2 గ్రాములు, 19-19-19 10 గ్రాములు లీటరు నీటికి కలిపి వారానికి ఒకసారి 30 రోజుల వరకు పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ నరసమ్మ, రైతులు పాల్గొన్నారు.

**పంట నమోదు తప్పనిసరి**

**గోపవరం :** రైతులు సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు తప్పనిసరి అని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం బేతాయపల్లెలో సాగుచేసిన వరిపంటకు సంబంధించి జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుండి అన్ని సహాయ సహకారాలు అందుతాయన్నారు. పంట నమోదు చేయడం వలన పంట నష్టపోయినప్పుడు బీమా వర్తింపజేయడంతో పాటు గిట్టుబాటు ధరకు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రతి రైతు వేసిన పంటకు పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సతీష్, రైతులు పాల్గొన్నారు

# భూమి పూజ



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**అట్లూరు :** మండల పరిధిలోని రెడ్డిపల్లి నుంచి గాండ్లపల్లి రోడ్డుకు సోమవారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రెడ్డిపల్లి గ్రామం బుచ్చిరాంపల్లి మీదుగా గాండ్లపల్లి వరకూ కంపచెట్లతో రోడ్డు మూసుకుపోయి పలుగ్రామాల ప్రజలు మండల కేంద్రమైన అట్లూరుకు వెళ్లాలంటే సుమారు పది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. దీంతో స్థానిక అట్లూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు బోవిళ్ల చిన్నసూరారెడ్డి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి డీఎంఎఫ్ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. దీంతో సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, రెడ్డిపల్లి సర్పంచు నాగం నరసారెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మినరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనరు లక్ష్మిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు లక్ష్మినారాయణ రెడ్డి, పెంచల్‌రెడ్డి, సుబ్బరాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 15న నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నికలు

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు పట్టణ నాయీబ్రాహ్మణ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ ఎన్నికలు ఈనెల 15న సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బీపీ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన నామినేషన్ల పరిశీలన, 7న నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 15న ఎన్నికల అనంతరం ఓట్లను లెక్కించి సాయంత్రానికి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. 16న ఉదయం కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్న తర్వాత అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని వివరించారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘంలో పోరుమామిళ్ల వాసులకు ప్రాధాన్యం



పెసల నరసింహులు (10 వ సారి)



తులసి సుధాకర్ (5 వ సారి)

**పోరుమామిళ్ల :** కడప జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులుగా ఈ సంవత్సరం 5 మందికి అవకాశం కల్పించారు. అందులో పోరుమామిళ్ల నుండే 5 మంది ఎన్నుకోవడం గమనార్హం.

పెసల నరసింహులు, తులసి సుధాకర్, గాజులపల్లె శ్రీనివాసులు, మాలెపాటి సత్యనారాయణ, మంజునాథ సుధాకర్‌లను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. పెసల నరసింహులు 10 వ సారి ఎన్నికయ్యారు. ఆయన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థాన అధ్యక్షులుగా ఉన్నారు. తులసి సుధాకర్ 5 వ సారి ఎన్నికయ్యారు. ఆయన శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థాన శాశ్వత అధ్యక్షులుగా ఉన్నారు. గాజులపల్లె శ్రీనివాసులు కన్యకాపరమేశ్వరీ ఆలయ అధ్యక్షులుగా ఉన్నారు. మాలెపాటి సత్యనారాయణ కన్యకాపరమేశ్వరీ ఆలయ మాజీ అధ్యక్షులు. మంజునాథ సుధాకర్ సత్యసాయి ప్రశాంతి నిలయం అధ్యక్షులుగా ఉన్నారు.

## 20 మద్యం బాటిళ్లు పట్టివేత

**రాజుపాళెం :** మండలంలోని పర్లపాడు గ్రామంలో మర్రి భూషణం అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.తులసీనాగ ప్రసాద్ తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు 20 మద్యం బాటిళ్లు, 9 బీర్ బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం అమ్ముతుంటే 9121100600 నెంబరుకు సమాచారం తెలపాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## నేడు, రేపు డిస్కౌంట్ మేళా

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొవ్వూరు గ్రాండ్‌లో మంగళ, బుధవారం ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎక్స్‌పో -2024 భారీ డిస్కౌంట్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌వీ సంస్థల అధినేత ఆర్‌వీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రావెల్ ఎక్స్‌పో కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, కాశీ, అయోధ్య, చార్‌ధామ్, సిమ్లా, మనాలితోపాటు ఆస్ట్రేలియా, సింగపూర్, యూరప్, దుబాయ్, బ్యాంకాంక్ వంటి అంతర్జాతీయ టూర్లపై భారీ డిస్కౌంట్ ఇస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9121144001, 9177333615 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# రోడ్డు ఆక్రమించారంటూ ఫిర్యాదు

**చాపాడు :** మండల కేంద్రమైన చాపాడులో మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారికి అనుసంధానమైన సర్వీసు రోడ్డు, అక్కడ నిర్మించాల్సిన బస్టాప్ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన శ్రీపతి నాగన్న, సుబ్బయ్య, కిషోర్‌లు సోమవారం స్పందనలో తహసీల్దారు భూషణం, డిప్యూటీ తహసీల్దారు యామినిలకు ఫిర్యాదు చేశారు. మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారికి సంబంధించిన స్థలంలో శ్రీపతి ప్రభాకర్, సుబ్బరాయుడు, లలితమ్మ అనే వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఫిర్యాదు చేశారు. ఇదే స్థలంలో బస్టాప్ ఏర్పాటుకు కూడా స్థలం కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దారు ఆర్ఐ ప్రమీల, మండల సర్వేయర్ సాయిలత, వీఆర్ఏలను పరిశీలనకు పంపారు. వారు అది ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి నిర్మాణాలకు పాల్పడుతున్న వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కొలతలు వేసేందుకు రెవెన్యూ సిబ్బంది వచ్చిన సందర్భంలో వాగ్వాదం జరగడంతో పోలీసులు వచ్చి ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని మందలించారు.

## ఆశాల పెండింగ్ అలవెన్సులు చెల్లించాలి

**కడప సెవెన్‌రోడ్స్ :** ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన పెండింగ్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, అమ్ములు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ లెప్రసీ, మలేరియా, టీబీ, ట్యూబెక్టమి అలవెన్సులు నిలిపివేయడం అన్యాయమన్నారు. కరోనా అలవెన్సులు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఆశాల అలవెన్సులు విడుదల చేయాలని కోరారు. సాధారణ సెలవులు, మెటర్నటీ లీవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మంజులవాణి, ఏరియా కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# కర్రసాములో 6 పతకాలు



రజత పతకాలు సాధించిన కర్రసాము క్రీడాకారులు

**పోరుమామిళ్ల:** నెల్లూరులో నిర్వహించిన సౌత్‌జోన్ కర్రసాము పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు సత్తాచూపి 6 రజత పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నాయబ్‌రసూల్ తెలిపారు. కర్రసాము పోటీలకు ఆల్‌ఇండియా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. పోరుమామిళ్లకు చెందిన బాలుర విభాగంలో వెంకట తేజెస్, శ్రీనిజ్, నాగూర్‌బాష, నోమన్ అహమ్మద్, బాలికల విభాగంలో తస్వీక, అయేమమ్ రజత పతకాలు సాధించినట్లు వివరించారు. సోమవారం విజేతలను పోరుమామిళ్ల క్రీడాభిమానులు అభినందించారు.

## ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ గ్యారేజీలో ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కడప డిపోలో డ్రైవర్ ఏపీ పద్మనాభం కోటిరెడ్డిసర్కిల్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందారన్నారు. అలాగే మరో డ్రైవర్ కుమార్ తనయుడు టూ వీలర్ ప్రమాదంలో తలకు దెబ్బతగిలి మంచానికే పరిమితం అయ్యాడన్నారు. కార్మికులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయన హెల్మెట్ ధరించి సైకిల్‌పై వచ్చి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ గోపాల్‌రెడ్డి, డీఎం డిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

# సకాలంలో వైద్య సేవలు అందించాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యులు వైద్య సేవలను అందించాలని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం 35వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా నగర శివార్లలోని రిమ్స్ లో గుడ్ సమ్మరిటన్ లాస్ అనే అంశంపై వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరలో ఉన్న హాస్పిటల్లో స్వచ్ఛందంగా ఎవరైనా చేర్పించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే సమీపంలోని హాస్పిటల్‌లో చేర్పించి వెళ్లిపోవచ్చని, వారు ఏ విధమైన మెడికల్ బిల్లులు, ఫీజులు గాని చెల్లించవలసిన అవసరం లేదన్నారు. వీరిపై ఎటువంటి పోలీసు కేసులు ఉండవు అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన వారికి గుడ్ సమ్మరీటిన్ కింద రూ. 5వేలు బహుమానం అందించి ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. ఒకవేళ సాయం చేసిన వారిలో ఎక్కువ మంది ఉంటే రూ.5 వేలు సమానంగా పంచి వారికి విడివిడిగా ప్రశంస పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఎక్కువ రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసిన వారికి రూ.లక్ష వరకు నగదు బహుమతిని అందజేస్తామన్నారు. రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి నియమాలను తప్పక పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పక హెల్మెట్‌ను ధరించాలి అన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు విజయభాస్కర్, ప్రసాద్, రిమ్స్ హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఎన్నికల ప్రచారానికి సంబంధించి పోస్టర్లను బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10, 11 తేదీలలో పల్లెకు పోదాం ప్రవాసీ యోజన కార్యక్రమం కింద కార్యకర్తలు ప్రతిఊరిలో నిద్ర చేయాలని, ఈ సందర్భంగా గ్రామీణులకు దేశ ప్రధాని అమలు చేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. బీజేపీ పార్ల మెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిడి వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# స్కౌట్‌తో క్రమశిక్షణ అలవడుతుంది



ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డికి పూలగుచ్ఛం అందజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం

**కడప ఎడ్యుకేషన్ :** దేశభక్తి, సామాజిక సేవతోపాటు క్రమశిక్షణను విద్యార్థుల్లో పెంపొందించడంలో స్కౌట్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గ సభ్యులు ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి గౌరవ సూచకంగా పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. నూతనంగా ఎన్నికైన స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు డీఈఓ రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ప్రమీల, అన్నమయ్య జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

**ప్రొద్దుటూరు :** మండలంలోని అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబుకు సీపీఎం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం పేదలకు అమృతానగర్‌లో ఇళ్ల స్థలాలను ఇచ్చిందన్నారు. 15 ఏళ్ల నుంచి అమృతానగర్‌లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మౌలిక వసతులు కల్పించే వరకు ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, లత, హసీనా, షాబీర్‌బాబు, పెంచల్‌రెడ్డి, రఫి, మధు, హుస్సేన్‌బాషా, పార్వతి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేందుకు సీపీఐ ప్రయత్నం

**అడ్డుకున్న పోలీసులు, రెవిన్యూ అధికారులు**



పి.పి.కుంటలోని ప్రభుత్వ భూమిలో జెండాలు పాతుతున్న సీపీఐ నాయకులు

**గోపవరం :** మండలంలోని బేతాయపల్లె సచివాలయం పరిధిలోని గోపవరం రెవెన్యూ పొలం-2 లోని 1557 సర్వేనెంబరు గల ప్రభుత్వ భూమిలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదల చేత గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా రెవెన్యూ, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పి.పి.కుంట జగనన్న లేఅవుట్ వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయించేందుకు ముందస్తు ప్రణాళిక మేరకు పేదలకు అక్కడికి తరలించి సీపీఐ జెండాలను నాటారు. గుడిసెలు వేసుకునేందుకు ప్రభుత్వ భూమిలో ఉన్న చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్ఓ వెంకటేశ్వర్లు సంఘటన ప్రదేశానికి చేరుకుని సీపీఐ నాయకులతో మాట్లాడారు. అక్కడి నుండి వారు కదలకపోవడంతో బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ రవికుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని ప్రభుత్వ భూమి నుండి ఖాళీ చేయించారు. అర్హత ఉన్న ఇళ్ల లేని పేదలు ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకుంటే వారందరికి జగనన్న లేఅవుట్లు వేసి వారికి ఇళ్ళు కూడా నిర్మించి ఇచ్చామని ఆర్ఐ తెలిపారు. ఇంకా అర్హత ఉండి స్థలాలు లేని వారు ఎవరైనా ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా ఆయా సచివాలయాల పరిధిలోనే స్థలాలు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ అనుమతి లేనిదే భూ పోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ హెచ్చరికలు జారీ చేశారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేద్దాం



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

**ప్రొద్దుటూరు క్రైం :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సహాయం చేసి వారి ప్రాణాలను కాపాడాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా ఆస్పత్రిలోని సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన 1 గంట లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. గాయపడిన వారిని నిస్వార్థంగా, స్వచ్ఛందంగా సహాయం అందించి దగ్గరలోని ఆస్పత్రికి చేర్చాలని చెప్పారు. బాధితులకు సహాయం చేసే క్రమంలో పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్పించి ప్రాణాలను కాపాడిన వారికి రూ. 5 వేల వరకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం కూడా ప్రభుత్వం తరపు నుంచి అందచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, ఎంవీఐ నారాయణనాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్, సెక్యూరిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ



బీవీఎస్ విద్యాసాగర్

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు మండల తహసీల్దార్‌గా బీవీఎస్ విద్యాసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా డోన్ మండలం నుంచి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన నజీర్ అహ్మద్‌ను ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యాసాగర్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



విజయశ్రీ

**రాజుపాళెం :** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఐ.వి జయశ్రీ పేర్కొన్నారు. ఎన్నికల బదిలీలలో భాగంగా కర్నూలు అర్బన్ నుంచి రాజుపాళెం తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఇందిరా రాణి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం తహసీల్దార్ విజయశ్రీకి డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథ రెడ్డి, ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, సర్వేయరు గురుశేఖర్‌రెడ్డి, వీఆర్ఓలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఉమారాణి

**దువ్వూరు :** దువ్వూరు మండల తహసీల్దార్‌గా ఉమా రాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా ఆత్మకూరు తహసీల్దార్‌గా ఆమె పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.



వై.భూషణం

**చాపాడు :** మండల తహసీల్దారుగా వై.భూషణం సోమవారం బాధ్యతలు చేపట్టారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం తహసీల్దార్లను బదిలీ చేసింది. ఈ క్రమంలో చాపాడు మండల తహసీల్దారుగా అనంతపురం జిల్లా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న వై.భూషణం నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాఖా పరమైన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



రోశయ్య

**గోపవరం :** మండల తహసీల్దారుగా రోశయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు దామోదర్‌రెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సుళ్ళూరుపేట తహసీల్దారుగా పనిచేస్తూ రోశయ్య ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ సిబ్బందితో పరిచయ కార్యక్రమం, అనంతరం బీఎల్ఓలతో సమావేశమయ్యారు.



క్రిష్ణకుమార్

**కలసపాడు :** మండల తహసీల్దారుగా ఎన్.ఎస్.క్రిష్ణకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రవీంద్రారెడ్డి బదిలీపై నంద్యాల జిల్లా బనగానపల్లెకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు క్రిష్ణకుమార్‌ను రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు



కడప కేంద్ర పురుషుల కారాగారంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

**కడప అర్బన్ :** జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సోమవారం రాజంపేట సబ్‌జైలును సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్లలో వున్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి తగిన న్యాయ సహాయం అందజేస్తామన్నారు. పాన్ ఇండియా -2024 అనే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైలులో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌జైల్ సూపరింటెండెంట్, పానెల్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నందలూరు, సిద్దవటం కోర్టులను జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సందర్శించారు. ఈనెల 9న జరుగబోయే జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని ఆయా కోర్టుల న్యాయవాదులతో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందలూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కోలార్ లత, సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస కళ్యాణ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ ప్రెసిడెంట్‌లు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.
- పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ కడప కేంద్ర పురుషుల కారాగారంను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మనోహర్ పాల్గొన్నారు.